సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



‘బలిమెల’ వినియోగంపై సమీక్ష

బలిమెల జలాశయంలో నీటి నిల్వల వాడకంపై ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు సమీక్షించారు. 8లో



ఈకేవైసీ నమోదుకు ఇక్కట్లు

పంటల బీమా పథకానికి ఈ కేవైసీ నమోదు చేసేందుకు ఆర్‌బీకేల అగ్రికల్చర్ అసిస్టెంట్లు నానా పాట్లు పడుతున్నారు. 8లో



మళ్లీ వర్షాలు

సాక్షి, పాడేరు: మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. పాడేరు పరిసరాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి భారీ వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జాబ్ మేళాలో 102 మందికి ఉద్యోగాలు

పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీ డాప్ సంయుక్తంగా గురువారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 391 మంది హాజరుకాగా, 102మంది ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఇస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడాప్ జేడీఎం కల్యాణి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సుజాత, జిల్లా ఉపాధి కల్పన అధికారి సంగీత, గిరిజన యువ ప్రగతి సంస్థ చైర్మన్ కుర్రబోయిన సింహాచలం పాల్గొన్నారు.

నేడు 50 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజవొమ్మంగి: మండలంలోని 11కేవీ జడ్డంగి ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సుమారు 50 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దివాకర్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమీనాబాద్, చెరకుంపాలెం, చికిలింత, దూసరపాము, జడ్డంగి, కింద్ర, లబ్బర్తి, లాగరాయి, లోదొడ్డి, మారేడుబాక, తంటికొండ, వాతంగి, వంచంగి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి మావోయిస్టు ఆవిర్భావ మాసోత్సవాలు

- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- ఏవోబీలో కూంబింగ్ ముమ్మరం చేసిన బలగాలు



లోతట్టుప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్

వై.రామవరం: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ మాసోత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిలో భాగంగా మండల సరిహద్దు ప్రాంతమైన ఏవోబీలో భారీ ఎత్తున యాంటీ నక్సల్స్ పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ పోలీసుస్టేషన్‌లో పటిష్టమైన భద్రత ఏర్పాటుచేశారు. రహదారులు, అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం అడ్డతీగల సీఐ నర్సింహరావు పర్యవేక్షణలో మండల లోతట్టు ప్రాంతానికి, సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారుల్లో వై.రామవరం ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో బాంబుస్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. అనుమానస్పద వ్యక్తులు, అపరిచితులపై నిఘా ఏర్పాటుచేశారు. వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



శిక్షణ పొందుతున్న వారికి కిట్లు పంపిణీ చేస్తున్న పీవో అభిషేక్

అరకులోయ టౌన్: ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను గిరియువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కోరారు. స్థానిక యూత్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 60 మంది గిరి యువతకు కిట్లను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద యువతకు శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. ఎంపిక చేసిన 60 మందికి నాలుగు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. ఇప్పటివరకు 178 మందికి శిక్షణ ఇవ్వగా వీరిలో 168 మంది వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటుకు ఆదేశం

పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. గురువారం పద్మాపురం గార్డెన్, కొత్తవలస, హెచ్‌ఎంటీసీ గార్డెన్‌ను ఆయన సందర్శించారు. పర్యాటకుల సాకర్యార్థం విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాల్సిన ప్రాంతాలను ఆయన సూచించారు.

100 డేస్.. అట్టర్ ఫ్లాప్

సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల పాలనలో గిరిజనులకు ఇచ్చిన హామీల ఊసే లేదు. అరకు సంత ప్రాంతంలో జనవరి 20న నిర్వహించిన ‘రా కదలిరా’ కార్యక్రమంలో ఆయన హామీలిచ్చిన ఏడింటిలో ఏ ఒక్కటీ కదలికలేదు. తాజాగా నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో కూడా వీటి ప్రస్తావన లేకపోవడంతో గిరిజనులు నిరాశకు గురయ్యారు. తమ సంక్షేమంపై ఆయన నిర్లక్ష్యం మరోసారి రుజువైందని వారు విమర్శిస్తున్నారు.

- నీటిమూటలుగా చంద్రబాబు హామీలు
- వందరోజుల పాలనలో ఏ ఒక్కటీ అమలుకాని వైనం
- పోలవరం ముంపు బాధితులకు దక్కని భరోసా



ఇటీవల గోదావరి, శబరి వరదకు నీట మునిగిన చింతూరు శబరి ఒడ్డు ప్రాంతం (ఫైల్)

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపుగా వందరోజులు పూర్తయింది. ప్రతిపక్షనేతగా చంద్రబాబు అరకు ప్రాంతంలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్క హామీపై కూడా ఆయన దృష్టిపెట్టలేదు. కనీసం క్యాబినెట్ సమావేశంలో ఏజెన్సీ ప్రాంత సమస్యలను ప్రస్తావించలేదు. ఈవిషయంపై గిరిజన సంక్షేమశాఖ మంత్రి దృష్టిపెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జీవో నంబరు 3 పునరుద్ధరణ బుట్టదాఖలేనా?

జీవో నంబరు 3 పునరుద్దరిస్తే నూరుశాతం ఉద్యోగాలు గిరి యువతకు దక్కుతాయి. ఏజెన్సీలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈమేరకు చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కొద్దిరోజులుగా గిరిజన సంఘం, సీపీఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు. క్యాబినెట్‌లో చర్చించి జీవోనంబరు 3 అమలుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వారు ఇటీవల వినతి పత్రం అందజేశారు. కనీసం ఆమె కూడా ఈ అంశాన్ని క్యాబినెట్ సమావేశం దృష్టికి తీసుకురాలేదు. సీఎం చంద్రబాబు కూడా దీనిపై దృష్టిపెట్టలేదు.

వాణిజ్య పంటలకు ప్రోత్సాహం ఏదీ?

చంద్రబాబు ఇచ్చిన హామీల్లో వాణిజ్య పంటలకు ప్రోత్సాహం కూడా ఒకటి. తగిన మార్కెటింగ్ సదుపాయం లేక వాణిజ్య పంటలపై గిరిజన రైతులు దృష్టి సారించలేకపోతున్నారు. కనీసం కూరగాయలు విక్రయించేందుకు జిల్లా కేంద్రంలోని రైతు బజార్ కూడా అందుబాటులో లేదు. అరకు, పాడేరు, చింతపల్లి మండలాల్లో వ్యవసాయ ఉత్పత్తులను విశాఖపట్నంలోని రైతు బజార్లకు తీసుకువెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో విదేశీ పంటలను సాగు చేస్తున్న ఔత్సాహిక రైతులు మంచి ఫలితాలు సాధించి అధిక ఆదాయం పొందుతున్నారు. ఈ స్థాయిలో సాగు చేపట్టాలన్న సంకల్పం గిరిజన రైతులకు ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువైంది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు హామీతో ఎంతో ఆశపడిన గిరిజనులకు ప్రభుత్వం తీరు నిరాశ కలిగిస్తోంది.

కుటుంబ వికాస పథకం గాలికి?

ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. వారి ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. కుటుంబం యూనిట్‌గా తీసుకుని స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించాలి. ఈ మేరకు చంద్రబాబు ఇచ్చిన కుటుంబ వికాస పథకం హామీ అమలు జాడ కనిపించడం లేదు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వందరోజుల పాలనలో ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.

చంద్రబాబు ఇచ్చిన హామీలు



అరకు సభలో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు

- జీవో నంబరు 3 పునరుద్ధరణ
- పోలవరం ముంపు గ్రామాలతో ప్రత్యేక జిల్లా
- గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- గిరిలో కుటుంబ వికాస పథకం
- వాణిజ్య పంటలకు ప్రోత్సాహం
- ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు
- అరకు కాఫీకి ప్రపంచస్థాయిలో బ్రాండింగ్

ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఊసేది?

ఏజెన్సీలో గిరిజనులు సాగుచేసే పంటలకు అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల అవసరం ఎంతో ఉంది. కొన్ని సందర్భాల్లో తగిన మార్కెటింగ్ లేక కనీసం పెట్టుబడులు కూడా పొందలేకపోతున్నారు. అల్లం, పసుపు తదితర రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు వీటి అవసరం ఎంతో ఉంది. దీనిపై ఇచ్చిన హామీని చంద్రబాబు విస్మరించారు.

ఆర్థికాభివృద్ధి ప్రణాళిక ఉత్తిదేనా?

జిల్లాల పునర్విభజనకు ముందు పాడేరు, అరకు నియోజకవర్గాలు విశాఖపట్నం జిల్లాలో, రంపచోడవరం నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో ఉండేవి. ఇవి జిల్లాకు శివారు ప్రాంతాల్లో ఉన్నందున వీటి అభివృద్ధిపై శ్రద్ధ కూడా తక్కువగా ఉండేది. ఈ నేపథ్యంలో గిరిజనులకు పాలనను మరింత చేరువ చేయాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడు నియోజకవర్గాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేసింది. వనరులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేతగా అరకు వచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే గిరిజనాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఇది అమలు అయితే తమ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని గిరిజనులు ఆశపడ్డారు. వంద రోజుల పాలనతో వాటి ఊసే లేకపోవడంతో చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి మరోసారి మోసపోయామని వారు ఆవేదన చెందుతున్నారు.



జీవో నంబరు3ను పునరుద్ధరించాలని మంత్రి సంధ్యారాణికి ఇటీవల వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం,సీపీఎం నాయకులు

‘జీవో నంబరు 3’పై చర్చేదీ?



సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు అరకు సభలో జీవో నంబరు 3ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. వంద రోజుల పాలనలో ఒక్కసారి కూడా దీనిపై క్యాబినెట్‌లో చర్చించకపోవడం అన్యాయం. తామంతా చంద్రబాబు హామీని గుర్తుచేస్తూ ఇటీవల గిరిజన మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేసిన ఫలితం లేకపోయింది.

– పాచిపెంట అప్పలనరస, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పాడేరు

ఊసేలేని ప్రత్యేక జిల్లా ఏర్పాటు



పోలవరం ముంపు గ్రామాల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వస్తే పోలవరం ముంపు గ్రామాలను ప్రత్యేక జిల్లాగా చేస్తానని చంద్రబాబు అరకు సభలో ప్రకటించారు. వందరోజుల పాలనలో ప్రత్యేక జిల్లా ఊసెత్తలేదు. ఇటీవల వరదలకు విలీన మండలాల్లో గ్రామాలు రెండు సార్లు మునిగినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి స్పందన కరువైంది.

– చిక్కాల బాబు, వరద బాధితుడు, వీఆర్‌పురం

ప్రత్యేక జిల్లా ఏర్పాటయ్యేనా?



రంపచోడవరం: పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాలకు ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేస్తామని ప్రతిపక్షనేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇది అమలైతే ఏలూరు జిల్లాలో పోలవరం, కుక్కునూరు, ఏలేరుపాడు, బూర్గంపాడు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, గంగవరం మండలాలు ఒక జిల్లాగా ఆవిర్భవిస్తాయి. దీనివల్ల జిల్లా కేంద్రంగా రంపచోడవరం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. దీనిపై చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరుతుందన్న ఆశతో ముంపు ప్రాంతాల ప్రజలు ఉన్నారు. అయితే వంద రోజులపాలనలో ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కనీసం ఇటీవల ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా దక్కలేదు.

అరకు కాఫీకి ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు



అరకు కాఫీకి ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం తరఫున 18,700 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలు ఎగుమతి అయ్యాయి. వీటిలో సింహభాగం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన రైతులే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు ప్రత్యేకంగా చేసేదీ ఏమీలేదు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రోత్సాహకాలు అందిస్తే సరిపోతుంది. ఈ దిశగా గిరిజనులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది.

నిర్జీవ తాబేళ్లు స్వాధీనం

- ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- గోనె సంచులతో వదిలిపెట్టి పరారైన ముఠా సభ్యులు



దుండగులు వదిలి వెళ్లిన తాబేళ్లనను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, స్థానికులు

గంగవరం : మండల కేంద్రమైన గంగవరం శివారు పోతురాజుబాబు గుడి సమీపంలో వాగు వద్ద నిర్జీవ తాబేళ్లను గురువారం గుర్తించినట్టు ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులో వదిలి వెళ్లిన 64 నిర్జీవ తాబేళ్లు, ఏడు సజీవ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి తాబేళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఫోక్స్‌పేట ఫారెస్ట్, పోలీస్ చెక్‌పోస్టు వద్ద నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఈ విషయం గుర్తించిన ముఠా సభ్యులు వాహనాలను గంగవరం వైపు మళ్లించి తాబేళ్లతో ఉన్న గోనె సంచులను పోతురాజుబాబు వాగు సమీపంలో వదిలి పరారు అయ్యారన్నారు. కుప్పలు కుప్పలుగా తాబేళ్లను గమనించిన స్థానికులు తమకు తెలియజేశారని తెలిపారు. వెంటనే సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. డీఎఫ్‌వో భవిత ఆదేశాల మేరకు సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్జీవ తాబేళ్లకు దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సజీవంగా ఉన్న ఏడు తాబేళ్లను సురక్షితంగా నీటిలో వదిలిపెట్టామన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఆదివాసీ ప్రతినిధి కుంజం వెంకటేశ్వర్లు దొర, సర్పంచ్ మడకం వెంకటరమణ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నూకరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జగదీష్, పద్మ, మనోహర్ పాల్గొన్నారు.

రాయితీపై మిరియాలు వొలిచే యంత్రాలు

- పంపిణీకి దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: కేంద్ర ప్రభుత్వం,స్పైసెస్ బోర్డు సహకారంతో గిరిజన రైతులకు 75శాతం రాయితీపై మిరియాలు వొలిచే, శుభ్రపరిచే యంత్రాల పంపిణీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అల్లం, పసుపు పాలిష్ చేసే యంత్రాలు కూడా 75శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పరికరాలు పొందేందుకు కనీసం ఎకరా భూమి ఉన్న రైతులు తమ పూర్తి వివరాలు, ధ్రువపత్రాలతో వచ్చేనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మాత్రం 90 శాతం రాయితీపై ఈ యంత్రాలను అందజేస్తామని తెలిపారు. వీటిని పొందేందుకు ఆసక్తి గల రైతులు పాడేరు ఐటీడీఏ కార్యాలయంలోని స్పైసెస్ బోర్డు,సెరికల్చర్ కార్యాలయం ఆవరణలోని ఉద్యానవన విభాగం అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వర్ణాంధ్ర- 2047కు ముందస్తు ప్రణాళికలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

సాక్షి,పాడేరు: స్వర్ణాంధ్ర- 2047పై జిల్లా అధికారులకు అవగాహన కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ ఆదేశించారు. గురువారం ఆయన విజన్ ప్లాన్ స్వర్ణాంధ్ర- 2047పై జిల్లాలోని అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు రాబోయే ఐదేళ్లలో సాధించబోయే ఫలితాలపై ముందస్తు ప్రణాళికలతో కూడిన నివేదికను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకుని ఈనెలాఖరులోగా ముందుగా మండల స్థాయి ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. ఆర్థికాభివృద్ధి సాధించే రంగాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఆయన ఆదేశించారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు,పర్యాటకం,వ్యవసాయ అనుబంధ విభాగాలు, పారిశ్రామిక రంగాల్లో పురోగతి దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలోను గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, సీపీవో ఎస్ఆర్‌కే పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నో స్వాగతం

మన్యం వచ్చే పర్యాటకులకు మంచు అందాలు స్వాగతం పలుకుతున్నాయి. పెదబయలు ప్రాంతంలో గురువారం ఉదయం 8.30 గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. హెడ్‌లైట్ల వెలుగులో వాహనాలు రాకపోకలు సాగించాయి. అయితే మధ్యాహ్నం భానుడు ప్రతాపం చూపాడు. సాయంత్రం 4.30 గంటల నుంచి వర్షం కురిసింది.

– పెదబయలు



పెదబయలులో కురుస్తున్న మంచు

మత్స్యగెడ్డ ప్రాంతంలో ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు



వరదలకు గిరిజనుల జీవితాలు చిన్నాభిన్నం

- దెబ్బతిన్న రోడ్లు, ముంపునకు గురైన పంట పొలాలు
- వారం రోజులు గడుస్తున్నా.. పరామర్శకు వెళ్లని అధికారులు
- సాయం చేయడంలోనూ అధికారుల తీరు దారుణం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి ఆవేదన



వివరాలు వెల్లడిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి



వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

అల్లిపురం (విశాఖ): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకేవీధి మండలం ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పలవాడ, సీలేరు, గాలికొండ తదితర పంచాయతీల్లో భారీ వర్షాలకు వేలాది మంది గిరిజనులు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అల్లిపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల అల్లూరి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించిందన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు ఆ జిల్లాలో వేలాది గిరిజన కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడ్డాయని, వందలాది ఎకరాల్లో పంట భూముల మీదుగా నీరు ప్రవహించిందన్నారు. చట్రాపల్లిలో ఓ మహిళ మృతి చెందినట్టు తెలిపారు. భారీ వరదలకు ధారకొండ పంచాయతీలో 22 గ్రామాలు, గుమ్మిరేవుల పంచాయతీలో 4, దుప్పులవాడ పంచాయతీలో 17 గ్రామాలు, గాలికొండ పంచాయతీలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ధారకొండ మండలంలోని ధారపురంలో నివసిస్తున్న 21 కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో నడుం లోతు నీరు ఇప్పటికీ ప్రవహిస్తోందన్నారు. అంతర్గత రోడ్లు కూడా ధ్వంసం కావడంతో గిరిజనులు పడ్డ కష్టాలు బాహ్య ప్రపంచానికి తెలియలేదన్నారు. గత 50 ఏళ్ల కాలంలో ఈ తరహా భారీ వర్షాలను తాము చూడలేదని గిరిజనులు తెలిపినట్టు చెప్పారు. ఇంతటి ప్రకృతి విపత్తు చోటుచేసుకుని వారం గడిచినా.. ఇప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. కనీసం పరామర్శకు కూడా రాలేదని గిరిజన ప్రజలు వాపోతున్నారన్నారు. రెవెన్యూ శాఖకు చెందిన ఒకరిద్దరు అధికారులు వచ్చి గిరిజన గ్రామాలను పరిశీలించినా.. వారి నుంచి ఎటువంటి సాయం అందలేదన్నారు. వ్యవసాయ భూముల ఆనవాళ్లు లేకుండా పోయి గిరిజనులు బాధపడుతుంటే రెవెన్యూ యంత్రాంగం తీరు చాలా దారుణంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన పట్టా భూములకే నష్ట పరిహారం ఇస్తామని అధికారులు నరికాదన్నారు. కొండ ప్రాంతం కావడంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయడం అంత సులభం కాదన్నారు. విజయవాడ వరద బాధితుల మాదిరిగా భారీ వర్షాలకు నష్టపోయిన గిరిజనులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. నిత్యావసర వస్తువులు అందించడంతోపాటు దెబ్బ తిన్న ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు కూడా నిర్మించాలని కోరారు. అన్ని రకాల భూములకు పంట నష్టం చెల్లించాలని, వరద కోతకు గురైన భూములను సాగుకు అనుకూలంగా తయారు చేయాలని, సాగుకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు ఉపాధి హామీ పథకంలో ప్రత్యేక పని దినాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు,ఎ.విమల, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ యువకులతో పోలీసులు

గూడెంకొత్తవీధి: పోలీసుల వాహన తనిఖీల్లో ఇద్దరు యువకులు గంజాయితో పట్టుబడ్డారు. ఎస్సై అప్పలసూరి వివరాల ప్రకారం.. ముందస్తుగా అందిన సమాచారంతో తమ పోలీసు సిబ్బంది పాతవీధి కూడలి వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, దారకొండ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. అక్కడ తమ సిబ్బందిని చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. కిముడు దొయితరి, అల్లంగి రాజేందర్ పట్టుబడ్డారు. మరొక యువకుడు తప్పించుకున్నాడు. పట్టుబడ్డ నిందితుల బ్యాగులను పరిశీలించగా 22.69 కిలోల గంజాయి పట్టుబడింది. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

పండగ వేళ ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–షాలిమర్ (08508) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ ఒకటి నుంచి నవంబరు 26వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు ప్రతీ మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. షాలిమర్–విశాఖపట్నం (08507) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 2 నుంచి నవంబరు 27వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు షాలిమర్‌లో ప్రతి బుధవారం తెల్లవారు 5 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–అరకు (08525) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ విశాఖపట్నంలో ఉదయం 8.30 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. అరకు–విశాఖపట్నం (08526) స్పెషల్ అరకులో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రి 6 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబరు 5 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: జిల్లా మహిళా శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి ఆ సంస్థ కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్ట్ భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30లోపు ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలి. https://visakhapatnam.ap.gov.in/ నుంచి దరఖాస్తు పొందవచ్చు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

- అనంతగిరి మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ శర్మ
- అనంతగిరి మండలంలో పర్యటన
- పాఠశాలలు, ఆస్పత్రి, సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

అనంతగిరి/డుంబ్రిగుడ/అరకులోయ రూరల్: అనంతగిరి మండలంలో మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ శర్మ గురువారం విస్తృతంగా పర్యటించారు. మందుగా చిలకలగెడ్డ మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలను ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో నగేష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు హాజరు మధ్యాహ్న భోజనం వంటి వాటిపై ఉపాధ్యాయులు సక్రమంగా సమాధానం ఇవ్వకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెండు వారాల్లో పాఠశాల తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం భీంపోలు సచివాలయాన్ని సందర్శించి సేవలపై ఆరా తీశారు. సచివాలయం ఉద్యోగులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. భీమవరం పీహెచ్‌సీని సందర్శించి అక్కడ వైద్య సేవలపై ఆరా తీశారు. సిబ్బంది సక్రమంగా హాజరు కావడం లేదని డాక్టర్లు పనితీరు బాగాలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారితో సమస్యను చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుమ్మకోట గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తన సరిగా ఉన్నట్టు చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. గుమ్మకోట సచివాలయాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు శెట్టి నీలవేణి, ఎంపీడీవో నగేష్, సర్పంచ్‌లు పాంగి అప్పారావు, జన్ని భీమాలమ్మ, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో అనేకమంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారని, అటువంటి పరిస్థితి తీసుకురావద్దన్నారు. నాణ్యమైన గుడ్లు, పప్పు, పాలు, ఇతర పౌష్టికాహార వస్తువులు అందించాలన్నారు. సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీలు, గర్భిణలు పాల్గొన్నారు.

బోరు పనులకు శంకుస్థాపన

మండల కేంద్రంలోని వాలీబాల్ క్రీడా మైదానంలో జెడ్పీ నిధులతో హ్యాండ్ బోర్ నిర్మాణానికి జెడ్పీటీసీ శెట్టి రోషిణితో కలిసి అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం శంకుస్థాపన చేశారు. అనంతరం అరకులోయ పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై దుకాణాలను పరిశీలించారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దుకాణాలు పెట్టొద్దని వ్యాపారులకు సూచించారు. త ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని బందెలదొడ్డి స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాన్ని పరిశీలించి, వివరాలను పెదలబుడు ఈఓ రాజ్‌కుమార్‌కు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ నిధులతో గొడౌన్ నిర్మిస్తున్నామని ఈఓ సమాధానం ఇవ్వగా పంచాయతీ తీర్మాణం చేశారా అని అడిగి తెలుసున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ శెట్టి రోణిణి, ఎంపీడీవో వెంకటేష్, పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, ఎంపీటీసీ శత్రుఘ్న, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, రామూర్తి, నొబో, రాంచందూర్ తదితరులు పాల్గొన్నారు.



బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

గంజాయి, డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న పాడేరు సీఐ దీనబంధు

పాడేరు : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో జీవితాలు ఛిద్రమవుతోందని యువత వాటికి దూరంగా ఉండి ప్రశాంత జీవితం గడపాలని పాడేరు సీఐ ధీనబంధు స్పష్టం చేశారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిషేధిత గంజాయి జోలికి ఎవ్వరు వెళ్లొద్దన్నారు. గంజాయి సాగు, రవాణ చట్ట రీత్య నేరమన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు గుంజుకునే ముఠాలు ఎక్కువ తిరుగుతున్నాయన్నారు. వారి పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాల పట్ల ప్రజలంతా నిశితంగా గమనించి అప్రమత్తంగా ఉండాలని అనవసర వెబ్ లింక్‌లపై క్లిక్ చేయవద్దన్నారు. పట్టణంలో ఎక్కడిబడితే అక్కడ వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే చర్యలు తీసుకుంటామన్నారు. అవసరం మేరకు జరిమానా విధిస్తామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు కారణమైతే లైసెన్స్‌లను రద్దు చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో మరమ్మతులు గురైన సీసీ కెమెరాలను వారం రోజుల్లో బాగు చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో రాత్రి పూట దొంగతనాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని రాత్రి గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించి దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిత్యం రద్దీగా ఉండే జిల్లా ఆస్పత్రిలో పోలీస్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజల ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని చెప్పారు.

ఈ-క్రాప్ నమోదుకు ఇక్కట్లు

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకం కోసం అర్హులైన ఎంపిక చేసి వారికి ఈ కేవైసీ నమోదు చేసేందుకు రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని డోకులూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో సుమారు 200 మంది గిరిజన రైతులకు ఈ–క్రాప్ కింద పంటల భీమా పథకానికి ఈ కేవైసీ చేయాలి. నేటికి డోకులూరు గ్రామ పంచాయతీలో సెల్ టవర్ ఏర్పాటు చేయలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీలో ఫైబర్‌నెట్ ఉండడంతో ఈ కేవైసీ నమోదు సులువుగా వేగంగా జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫైబర్ నెట్ తొలగించారు. దీంతో నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా గ్రామ సచివాలయంలో నెట్ సేవలతో చేసే పనులకు అంటంకం ఏర్పడుతోంది. ఉచిత పంటల బీమా పథకానికి ఈ కేవైసీకు అవస్థలు తప్పడం లేదు. సుమారు 200 మంది గిరిజన రైతులు బర్సింగి పంచాయతీ కొత్తాబు, కురిడిమెట్ట ఘాట్ వద్ద కొండపై సిగ్నళ్ల దగ్గరకు వచ్చి ఈ–కేవైసీ చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పైగా సర్వర్ డౌన్ కారణంగా రైతులకు ఈ కేవైసీ చేయించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆనంద్ స్పష్టం చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై సబ్ కలెక్టర్ కొరడా

- 3 వాహనాల పట్టివేత
- తహసీల్దార్ కార్యాలయానికి తరలింపు



హుకుంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాధీనం చేసుకున్న ఇసుక వాహనాలు

హుకుంపేట : ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పట్టుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగుడుపుట్టు, గరుడాపల్లి గెడ్డల వద్ద రోజూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు తన దృష్టికి రావడంతో గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలకు వెళ్లి మూడు వ్యాన్‌లు, మూడు ట్రాక్టర్లను పట్టుకోగా స్థానిక సీఐ సన్యాసినాయుడు దిగుడుపుట్టు గ్రామానికి చెందిన ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను గురువారం ఉదయం పట్టుకున్నారు. మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు తనకు తెలియడంతో తనిఖీ చేసి ఈ గ్రామాల సమీపంలో ఇసుక క్వారీల వద్ద వాహనాలను పట్టుకున్నట్టు తెలిపారు. ఇసుక తవ్వకాల వల్ల గెడ్డల్లో సుడిగుండాలు పెరిగి అమాయక గిరిజనులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఇకపై ఎక్కడ ఇసుక అక్రమంగా తరలించినా వాహనాలను సీజ్ చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై విస్తృతంగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: పోస్టల్ శాఖలో పొదుపు ఖాతాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, ఖాతాలు తెరిస్తే కలిగే ఆర్థిక భరోసాపై అవగాహన కల్పించాలని అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఐపీవో బి.ఉపేంద్ర సిబ్బందికి తెలియజేశారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన బీపీఎంలు, ఏబీపీఎంలతో గురువారం పోస్టల్ సేవలపై గిరిజన గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు సబ్ డివిజన్ ఐపీవో బి.ఉపేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెవెళ్లి పోస్టల్ శాఖ పొదుపు ఖాతాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో పోస్టల్ సేవలు అందించేలా పనిచేయాలని సూచించారు. ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య ,ఆర్‌పిఎల్‌ఐ, పిఎల్‌ఐ, బీమా, ఐపిపిబి వంటి ఖాతాల వల్ల కలిగే లబ్ధిని తెలియజేయాలన్నారు. ఎంవో శ్రీను, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ,అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక వేధింపుల ఘటనపై జ్యుడీషియల్ విచారణకు డిమాండ్

- ఆదివాసీ చైతన్య వేధిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి



అడ్డతీగల: గంగవరం ఆశ్రమ పాఠశాలలోని ఇంటర్మీడియట్ హాస్టల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు.

అధికారులకు నేరుగా విద్యార్థినులు ఫిర్యాదు చేసుకునే దుస్థితికి పరిస్థితులు దిగజారాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని, బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదని ఆరోపించారు. పనసలపాలెం ఆశ్రమ పాఠశాలలోనూ విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టి, అసభ్యకర పదజాలంతో దూషించారన్నారు. ఇటువంటి ఘటన లు చోటుచేసుకోకుండా పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై పోక్సో యాక్టు ప్రకారం కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'బలిమెల' వినియోగంపై సమీక్ష

సమావేశమైన ఆంధ్రా–ఒడిశా జెన్‌కో అధికారులు

సీలేరు: ఆంధ్రా– ఒడిశా రాష్ట్రాల జలవిద్యుత్ కేంద్రాలకు నీటిని అందించే బలిమెల జలాశయంలో నీటి నిల్వలపై ఇరు రాష్ట్రాల అధికారులు గురువారం సమీక్షించారు. స్థానిక జెన్‌కో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో కలిపి 131.6154 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు లెక్కించారు. ఇందులో ఆంధ్ర వాటాకు 70.0195 టీఎంసీలు, ఒడిశాకు 61.5959 టీఎంసీలు పంపకాలు జరిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయం నీటి మట్టం 1612.60 అడుగులు ఉండగా ఎగువ నుంచి వరదనీరు చేరుతోందన్నారు. దీనివల్ల మరింత నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రస్తుతం బలిమెల జలాశయానికి ఇరు రాష్ట్రాల అవసరాల నిమిత్తం రోజువారీగా నీటిని వాడుకునేలా నిర్ణయించారు. రానున్న వేసవిలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా పుష్కలంగా ఉన్న నీటి నిల్వలను సమన్వయంతో వాడుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీరు రామభద్రరాజు, ఈఈ రాజేంద్రప్రసాద్, ఏడీ వెంకటమధు, ఒడిశా తరఫున పాట్టేరు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు శెట్టి, చిత్రకొండ ఎస్ డ్యాం ఎస్ఈ రమాకాంత్, జనరల్ మేనేజర్ శివప్రసాద్‌రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిరావు దాస్ పాల్గొన్నారు.

కనులపండువగా అమ్మవారి జాతర



ఊరేగింపులో భక్తులు

కూనవరం: మండల కేంద్రంలో గంగానమ్మ తల్లి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. గంగపుత్రులు ఏటా చేపల వేటకు వెళ్లడానికి కొద్ది రోజు ముందు ఈ జాతర జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గోదావరి, శబరి నదుల సంగమ తీరంలో పుణ్య స్నానాలు ఆచిరించి, నూతన వస్త్రాలు ధరించి, గంగానమ్మ దేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం వివిధ రంగులతో అలకరించిన కుల వృత్తిలో భాగమైన పడవను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగించి శబరి, గోదావరి సంగమం వద్ద దీపాలు వెలిగించి వాటిని పడవలో అమర్చి నదిలో విడిచిపెట్టి పండగ తంతును ముగించారు. ఏడాది పొడవునా చేపల వేట సాగాలని, కుటుంబాలు సంతోషంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.

రైతులకు సూచనలు



చింతకర్రపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఉషారాణి

వై.రామవరం: మండలంలోని చింతకర్రపాలెం గ్రామంలో గురువారం వ్యవసాయాధికారి ఉషారాణి అధ్యక్షతన ప్రధానమంత్రి పసల్ బీమా పథకంపై సచివాలయాల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. బీమా చేసే విధా నం, ప్రయోజనాలు, చేకూరేలబ్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. దీనిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటకోత ప్రయోగం వలన వచ్చే దిగుబడి, పంట నష్టం అంచనా వేయడం తదితర అంశాలను వివరించారు. మొక్కజొన్న పంట సాగుపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎరువులు, కషాయాలు తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. పొలంబడి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎంఏఓ ఉషారాణి, అడ్డతీగల, రాజవొమ్మంగి ఎమ్ఏఓలు సువర్ణ, రమేష్ నాయుడు, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

డోలీపై ఆస్పత్రికి గిరిజనుడి తరలింపు



డోలీపై డౌనూరు ఆస్పత్రికి గిరిజనుడిని తరలిస్తున్న తాటిబంద గ్రామస్తులు

చింతపల్లి: మారుమూల గ్రామాల్లో డోలీ మోతలు నిత్యకృత్యంగా మారాయి. మండలంలోని అంజలీ శనివారం పంచాయతీ తాటిబంద గ్రామానికి చెందిన గిరిజనుడు సీందెరి లక్ష్మణరావు అనారోగ్యానికి గురయ్యాడు. గురువారం అతడిని ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడ్డారు. గ్రామానికి రహదారి సదుపాయం లేకపోవడంతో గ్రామస్తుల సహకారంతో డోలీమోతపై నాలుగు కిలోమీటర్ల దూరంలోని బచ్చింత గ్రామం వరకూ అనేక ఇబ్బందులు పడి కొండలు, వాగులు దాటించి తీసుకువచ్చారు. అక్కడ నుంచి వాహనంలో డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తమ గ్రామంలో అంగన్‌వాడీ భవనంగానీ పాఠశాలగానీ లేదని, కనీసం రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇలా అత్యవసర సమయాల్లో తమకు డోలీమోతలే దిక్కు అవుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

చూచుకొండలో దారుణం

- భార్యాభర్తలపై హత్యాయత్నం
- అనంతరం నిందితుడి ఆత్మహత్య
- వివాహేతర సంబంధమే కారణమని అనుమానం



కేజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కొయిలాడ చంద్ర



చంద్ర భర్త మోహన్



ఆత్మహత్యకు పాల్పడిన నిందితుడు సోంబాబు (ఫైల్)

మునగపాక: కొంతకాలంగా తనతో మాట్లాడకపోగా, ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని తట్టుకోలేక వివాహితపై దాడికి దిగి, అడ్డం వచ్చిన భర్తపై కూడా దాడి చేసిన ఘటన మునగపాక మండలం చూచుకొండలో గురువారం జరిగింది. దాడి అనంతరం నిందితుడు రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. చూచుకొండకు చెందిన కొయిలాడ మోహన్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోహన్ భార్య చంద్ర అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తోంది. ఇదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కాండ్రేగుల సోంబాబు(41)తో చంద్రకు గతంలో వివాహేతర సంబంధంపై గొడవలు జరిగాయి. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించారు. ఒకరితో మరొకరు సంబంధం లేకుండా బతకాలని గ్రామ పెద్దలు హితవు పలికారు. అయినప్పటికీ సోంబాబులో మార్పు కనిపించలేదు. ఇటీవల తన ఇంటి ఎదురుగా ఉన్న చంద్రకు ఫోన్‌చేస్తున్నా ఆమె స్పందించకపోవడంతో, ఎలాగైనా ఆమెను హత్య చేయాలనుకున్నాడు. గురువారం ఉదయం ఉద్యోగానికని ఇంటి నుంచి చంద్ర బయలుదేరింది. దీన్ని గమనించిన సోంబాబు ఆమె వద్దకు వచ్చి కత్తితో దాడికి దిగాడు. తప్పించుకునే క్రమంలో చంద్ర చేయికి కత్తి తగిలింది. అంతటితో వదలకుండా ఆమె తలపై దాడి చేశాడు. సమీపంలోనే ఉన్న చంద్ర భర్త మోహన్ పరుగున వచ్చి సోంబాబును నిలువరించేందుకు ప్రయత్నించగా అతనిపై కూడా కత్తితో దాడి చేశాడు. భార్యాభర్తలిరువురి చేతులకు, తలకు తీవ్రగాయాలవడంతో స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి, అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సిఫార్సు మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చంద్ర కేజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉంది. భర్త మోహన్ పరిస్థితి అదుపులో ఉంది.

పట్టాలపై శవమై..

దాడికి పాల్పడిన సోంబాబు సంఘటనా స్థలం నుంచి పరారవడంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఫోన్‌కు పలుమార్లు రింగ్ చేసినా స్పందన లేదు. అదే సమయంలో యలమంచిలి మండలం తురంగలపాలెం రైల్వే ట్రాక్‌పై పడి వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గుర్తించిన కొంతమంది యలమంచిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చూచుకొండ నుంచి పరారైన సోంబాబు మృతదేహంగా నిర్ధారించుకున్నారు. మునగపాక పోలీసులు యలమంచిలి పోలీసుల సహకారంతో రైల్వే పోలీసులకు ఘటనకు సంబంధించిన వివరాలు అందించారు. మృతుడు సోంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టేకు కలప తరలిస్తున్న వ్యాన్ సీజ్



రాజవొమ్మంగి మీదుగా వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలప

రాజవొమ్మంగి: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి గస్తీ తిరుగుతున్న అటవీ అధికారులకు టేకు కలపతో వెళుతున్న బొలేరో గూడ్స్ వ్యాన్ పట్టుబడింది. ఈ వ్యాన్ మండలంలోని ఒట్టిగెడ్డ గ్రామం నుంచి పాత కృష్ణాదేవిపేట వెళుతున్నట్లు రాజవొమ్మంగి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కలపతో పాటు వ్యాన్‌ను సీజ్ చేసి తమ కార్యాలయానికి తరలించామన్నారు. 6/6 కొలతలతో మంచం తయారీకి తగినట్లుగా టేకు కలప కోసి తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు. కలప అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్‌బీవో ప్రసాద్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గూడెంకొత్తవీధి: సంకాడ పంచాయతీ ఉసిరిగూడెం వద్ద పేకాట శిబిరంపై గూడెంకొత్తవీధి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అప్పలసూరి మాట్లాడుతూ ఉసిరిగూడెంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.6500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.